నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 19 మార్చి 2025 | SANGAREDDY



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో, అర్చకులు

## కేసీఆర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వానం

వర్గల్, మార్చి 18: వర్గల్ మండలం నాచగిరి క్షేత్రంలో ఈనెల 19 నుంచి జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు మంగళవారం ఆలయ ఈవో విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, లక్ష్మీ నృసింహస్వామి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆలయ అర్చకులు కృష్ణామాచార్యులు, జగన్నాథాచార్యులు, నాగరాజుశర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

## నీళ్లిచ్చి పంటలను కాపాడాలి

### కొమురవెల్లిలో బీఆర్‌ఎస్ ధర్నా



కొమురవెల్లిలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొమురవెల్లి, మార్చి 18: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి ఆధ్వర్యంలో కొమురవెల్లిలో మండుటెండల్లో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కొమురవెల్లి పోలీస్ బొమ్మ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించడంతో కొమురవెల్లి ఎస్సై రాజు సిబ్బందితో వచ్చి బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీళ్లు అందించాలని డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మండుటెండల్లో సైతం ఈ ప్రాంతంలోని చెరువులన్నీ మత్తడి దూకిన విషయాన్ని గుర్తుచేశారు. ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కొమురవెల్లి మండలంలో సుమారు 1100 ఎకరాల్లో వరిపంట ఎండిందని, ఇప్పటికీ నీళ్లు విడుదల చేయకపోతే మొత్తం ఎండిపోయే పరిస్థితి వస్తుందని వాపోయారు. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను పరిశీలించడానికి వచ్చినప్పుడు రెండు రోజుల్లో నీళ్లు వస్తాయని చెప్పారని, ఎంపీ వచ్చి 10రోజులు గడిచినా ఇప్పటికీ నీళ్లు రాలేదన్నారు. వెంటనే సాగునీరు అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, ముత్యం నర్సింహులుగౌడ్, మెర్గు కృష్ణాగౌడ్, మాజీ సర్పంచ్‌లు పచ్చిమడ్ల స్వామిగౌడ్, కరుణాకర్, మాజీ ఉప సర్పంచ్ కొండ శ్రీధర్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బూర్గు స్వామిగౌడ్, సిలువేరు కనకమల్లేశం, వూడెం గోపాల్‌రెడ్డి, పచ్చిమడ్ల వెంకటేశ్‌గౌడ్, గొల్లపల్లి నాగరాజు, నరేశ్‌బాబు, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో నీరివ్వాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఇంటిని పరిశీలించిన బల్దియా సిబ్బంది

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

హుస్నాబాద్ టౌన్, మార్చి 18: హుస్నాబాద్‌లోని 20వ వార్డులో రేకుల షెడ్డుకు రూ. 2వేల పన్నుపై 'పండుటాకుకు ఎంత కష్టం'పై 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ కనకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఇందిర అనే మహిళ ఇంటికి వెళ్లి రేకుల షెడ్డును పరిశీలించారు. ఇంటి రేకుల షెడ్డు కొలతలు సేకరించారు. నిబంధనల ప్రకారం 20వ వార్డు బ్లాక్ ఏ పరిధిలోకి వస్తుందని, ఎంత పన్ను విధించాలనే విషయాలపై పరిశీలించి సవరిస్తామని సదరు కుటుంబానికి అధికారులు హామీ ఇచ్చారు. మున్సిపల్ వార్డు అధికారులు సాంబరాజు, మమత, సత్తార్, శ్రీధర్ పాల్గొన్నారు.



రేగులపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

## ఎండిన పంటల పరిశీలన

బెజ్జంకి, మార్చి 18: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని రేగులపల్లిలో ఎండిన పంటలను మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీరందక పంటలు ఎండుపోతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రణాళిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ఎండిన పంటలను గుర్తించి రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు మల్లేశం, మహేందర్, శ్రీకాంత్, హరీశ్ ఉన్నారు.

# రైతు ఇంట చావుకేకలు



## ఆగని అన్నదాతల ఆత్మహత్యలు

## ఉమ్మడి మెదక్ జిల్లాలో రోజుకో రైతు మృతి

ఆరుగాలం కష్టపడి నలుగురికి అన్నంపెట్టే అన్నదాత తనువు చాలిస్తున్నాడు. ప్రకృతితో పాటు ప్రభుత్వం నుంచి చేయూత, సహకారం కరువై, ఎవుసం భారంగా మారి కాడివదిలేస్తున్నాడు. పంటలు ఎండిపోవడం, నీళ్లకోసం బోర్లు తవ్వించడం, సాగు పెట్టుబడుల కోసం అప్పులు చేయడం, రుణమాఫీ వర్తించక పోవడం, రైతుభరోసా రాక ధైర్యం కోల్పోతున్నాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో తను నమ్ముకున్న పొలంలోనే బలవన్మరణానికి పాల్పడుతున్నాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయి అనేక రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



రైతు బానోతు బాలు ఫొటోను చూపిస్తూ రోదిస్తున్న భార్య సుకిణి, కూతురు వసంత

- కాంగ్రెస్ పాలనలో 135మంది ఆత్మహత్య
- ప్రభుత్వ చేయూత కరువై.. పొలంలోనే బలవన్మరణం
- బోర్లువేసి అప్పుల పాలవుతున్న అన్నదాతలు
- సంపూర్ణంగా అమలుకాని రుణమాఫీ
- పూర్తిగా అందని రైతుభరోసా
- విధిలేని పరిస్థితుల్లో అఘాయిత్యం
- రోడ్డున పడుతున్న రైతు కుటుంబాలు



రైతు బానోతు బాలు వేసిన బోరుబావి

సిద్దిపేట, మార్చి 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. నిత్యం ఏదో ఒక ఊరిలో రైతు ఆత్మహత్య ఘటన చోటుచేసుకుంటున్నది. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో రైతులకు చేయూత కరువై మెదక్ జిల్లాలో 75 మందికి పైగా సిద్దిపేట జిల్లాల్లో 35, సంగారెడ్డి జిల్లాలో 25, మొత్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 135 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. చాలా మంది రైతులకు పంట రుణమాఫీ వర్తించలేదు. రెండు లక్షల పైన ఉన్న పంటరుణం ఉన్న రైతులు బ్యాంకులో డబ్బులు కట్టాలని ప్రభుత్వం సూచించగా, చాలామంది రైతులు రుణమాఫీ అవుతదని అప్పులుతెచ్చి కట్టారు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వారి రుణమాఫీని మరిచి పోయింది. దీంతో బ్యాంకులో ఉన్న అప్పుకు తోడు..బ్యాంకు వడ్డీ కట్టడానికి తెచ్చిన డబ్బులు తడిసి మోపెడు అయ్యాయి. ఇప్పుడు రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పంట పెట్టుబడి సాయం రాక అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తున్నారు. ఈసారి సాగునీటి సమస్య ఎదురు కావడంతో పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతులు అప్పులు చేసి మరీ బోర్లు వేయిస్తున్నారు. నీళ్లు పడక, పంటలు ఎండిపోతుండడంతో మనస్తాపం చెంది చాలామంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పొలాల్లోనే రైతులు ఆత్మహత్యకు ఒడిగడుతూ కుటుంబాల్లో పుట్టెడు దు:ఖాన్ని మిగిలిస్తున్నారు. ఎకరాకు రూ. 15 వేల రైతు భరోసా ఇస్తానని చెప్పిన కాంగ్రెస్, తీరా రెండు పంటలకు ఎగ్గొట్టింది. కేసీఆర్ హయాంలో ఠంఛన్‌గా పంటల సాగుకు ముందే రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో రైతుబంధు ఎకరానికి రూ. 10 వేలు పడేది. దీంతో రైతులకు పెట్టుబడి రంది లేకుండా పోయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పంట రుణమాఫీ విషయంలో రైతులను ప్రభుత్వం ధోకా చేసింది. పంటలకు బోనస్ అని చెప్పి అది మోసం చేసింది. దీంతో రైతు ఎవుసం చేయలేక తనువు చాలిస్తున్నాడు.

## పంట రుణం మాఫీ కాలే...

- ఆరు బోర్లు వేస్తే చుక్కనీరు రాలే..
- తెచ్చినకాడ అప్పులు పెరిగిపోయాయి..
- లోలోన కుమిలి ఆత్మహత్య చేసుకున్న రైతు బానోతు బాలు
- రోడ్డున పడ్డ కుటుంబం

సిద్దిపేట, మార్చి 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపాయే.. రైతు భరోసా రాకపాయే.. అప్పులు తెచ్చి బోర్లు వేయిస్తే చుక్క నీరు రాకపాయే.. పంటలేమో పండకపాయే.. తెచ్చినకాడ అప్పులవాళ్లు పైసలు అడగవట్టిరి.. బిడ్డపెండ్లికి ఎదిగే.. అప్పులు ఎలా తీర్చాలే... బిడ్డ పెండ్లి ఎట్లా చేయాలే... అని తనలో తాను కుమిలిపోయి.. ఏం చేయాలో పాలుపోక తనకు చావే మార్గం అనుకున్నాడు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం మల్‌చెరుతండా మదిర గ్రామం దుబ్బతండాకు చెందిన రైతు బానోతు బాలు (45). నవంబర్ 29న రాత్రి భార్యతో కలిసి రొట్టె తిన్న అతడు ఇంటి బయటకు వచ్చి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి బిడ్డ పెండ్లి ఆగిపోయింది. పుట్టెడు దుఃఖంతో ఆ కుటుంబం కొట్టుమిట్టాడుతోంది.

### అప్పులు పెరిగి...

రైతు బానోతు బాలుకు భార్య సుకిణి, కుమారుడు వినోద్, కూతురు వసంత ఉన్నారు. వీరికి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. వరి, మొక్కజొన్న పంటలను సాగుచేస్తూ కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యవసాయ బావిలో నీళ్లు అంతంతమాత్రంగానే ఉండేవి. ఈ క్రమంలో తన పొలంలో ఆరు బోర్లు తవ్వించాడు. ఒక్కో బోరు 500 ఫీట్ల వరకు వేయించాడు. చుక్క నీరు రాలేదు. బోరు తవ్వించడానికి, భూమిని చదును చేయించడానికి సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటలు సరిగ్గా పండలేదు. అప్పులు తెచ్చిన కాడ మిత్తిలు పెరిగి పోయాయి. పంట పెట్టుబడికి సైతం అప్పులు తెచ్చాడు. కేసీఆర్ ప్రభుత్వంలో పంట పెట్టుబడి రైతుబంధు సమయానికి వచ్చి పెట్టుబడికి ఇబ్బంది లేకుండే. ఇవ్వాల ఆ పరిస్థితి రైతుకు లేకుండా పోయింది. బ్యాంకులో తీసుకున్న పంట రుణం అట్లే ఉండిపోయింది. హుస్నాబాద్ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణం అసలు మిత్తి అన్నీ కలిపి సుమారుగా రెండు లక్షల వరకు ఉంది. కాంగ్రెస్ చేసిన రుణమాఫీలో ఈ రైతుకు ఒక్క రూపాయి మాఫీ కాలేదు. చేసిన అప్పులు తీర్చడం కోసం నెదర్లాండ్ దేశం బతక పోతానని ఓ బ్రోకర్‌ను కలిశాడు. వీసా ఇప్పిస్తానని బ్రోకర్ రూ. 50 వేలు తీసుకున్నాడు. ఆ బ్రోకర్ వీసా ఇప్పించలేదు. దీంతో అప్పులు రోజు రోజుకు పెరిగిపోయాయి. ప్రభుత్వం తనకు రుణమాఫీ చేయలేదని కుటుంబ సభ్యులు, ఇతర పెద్ద మనుషులతో చెప్పుకుంటూ రైతు బాలు బాధపడేవాడని గ్రామస్తులు గుర్తుచేశారు. దీంతో కుమిలిపోయి నవంబర్ 29 రాత్రి రైతు బానోతు బాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు బానోతు బాలు ఇల్లు



దుబ్బాక హాస్టల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

## గురుకుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక, మార్చి 18: ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు విద్యతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మంగళవారం దుబ్బాక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రిపరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. గణితం, ఫిజిక్స్ సబ్జెక్టుల్లోని పలు అంశాలపై విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించారు. స్వయంగా బోర్డుపై గణితంలోని పలు అంశాలను బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, తడబాటుకు గురికాకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పదవ తరగతి తొలిమెట్టు అని సూచించారు. భోజనం సరిగా లేదంటూ అదనపు కలెక్టర్ ఎదుట విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనంలో కొనసాగుతున్న వసతి గృహంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని, డార్మెటరీ లేకపోవడంతో తరగతి గదిలోనే నిద్రిస్తున్నామని తెలిపారు. డెస్కులు, ఫర్నిచర్ లేక భోజనం, విద్య అంతా నేలపైనే కొనసాగుతోందని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన అదనపు కలెక్టర్.. కిచెన్‌షెడ్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండడం, బీట్‌రూట్ కూర ఉడకక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతలేని బియ్యం బస్తాలను తిరిగి పంపించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కరశర్మ తదితరులు ఉన్నారు.

## నీళ్లిస్తేనే పంటలు దక్కుతాయి

- గోదావరి జలాలు ఇవ్వాలంటూ రైతుల రాస్తారోకో



సిద్దిపేట–కామారెడ్డి రహదారిపై రాస్తారోకో చేస్తున్న మాచాపూర్ రైతులు

సిద్దిపేట, మార్చి 18: నీళ్లు లేక తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే రంగనాయక సాగర్ ద్వారా గోదావరి జలాలు అందించి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ రైతులు సిద్దిపేట– కామారెడ్డి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సిద్దిపేట రూరల్ మండలంలోని మాచాపూర్‌లోని దిగువన ఉన్న రైతుల పంట పొలాలకు రంగనాయక సాగర్ ద్వారా గతంలో సాగునీటిని అందించేవారని, కొన్ని రోజులుగా భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయి నీరులేక తమ పంట పొలాలు ఎండుతున్నాయని, వెంటనే తమకు రంగనాయక సాగర్ ద్వారా గోదావరి జలాలు అందించాలని కోరారు. ఎన్నిసార్లు ఇరిగేషన్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. తమ పంట పొలాలను రక్షించుకోవడం కోసం గత్యంతరం లేని పరిస్థితిలోనే తాము రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేయాల్సి వచ్చిందని వాపోయారు. తాము ఇరిగేషన్ అధికారులను అడిగితే కోదండరావుపల్లి, బంజేరుపల్లి గ్రామాలకు ఇచ్చిన తర్వాతనే తాము మాచాపూర్‌కు నీటిని ఇస్తామని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు.



### మూడెకరాల్లో పంట ఎండింది

మేము నాలుగెకరాల్లో వరి సాగుచేస్తే నీరులేక ఇప్పటికే మూడెకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. వరి పంటలో జీవాలను మేపుతున్నాం. మిగిలిన ఎకరం వరి పంట పొట్టదశలో ఉంది.దానిని కాపాడుకునేందుకు సాగునీరు వదలాలని తాము ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దయచేసి అధికారులు నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలి.

– శేఖర్, రైతు, మాచాపూర్, సిద్దిపేట జిల్లా

## డంపుయార్డు అనుమతులు రద్దు చేయాలి

- కేంద్ర అటవీశాఖ డైరెక్టర్‌కు వినతి

గుమ్మడిదల, మార్చి 18: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గుమ్మడిదల రైతు జేఏసీ నాయకులతో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్ ఢిల్లీలో కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్‌కుమార్ అవస్తికి వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రగొల్ల మురళీ, గుమ్మడిదల డంపింగ్‌యార్డు వ్యతిరేక పోరాట సమితి, రైతు జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సదానందరెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్, జోగినాథ్‌గుప్తా తదితరులు ఢిల్లీలో మెదక్ ఎంపీతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గుమ్మడిదల మండలంలోని 13 గ్రామ పంచాయతీల ప్రజలు డంపింగ్ యార్డు రద్దు చేయాలని ఏకగ్రీవ తీర్మానాల పత్రాలను అందజేసినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

## గీతంకు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్రాంట్

పటాన్‌చెరు, మార్చి 18: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు మరో ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సంస్థ మంజూరు చేసింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగంలోని అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్, ఫౌండేషన్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతాహర్ రెజాకు ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. వక్ర మైక్రో పైప్‌ల్లో ప్రవాహ అస్థిరతల అధ్యయనం పేరిట చేపట్టే ఈ ప్రాజెక్టు, అధునాతన సంఖ్యా విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి మైక్రోడోమైన్‌లలో ద్రవ ప్రవాహ ప్రవర్తనను మూడేండ్ల కాల పరిమితితో పరిశోధించడానికి ఉద్దేశించిందని తెలిపారు. ఈ పరిశోధనలో డాక్టర్ రెజాకు సహాయకారికి ఉండేందుకు జూనియర్ రీసెర్చ్ ఫెలో అవసరమని తెలిపారు. ఎంటెక్ లేదా ఎమ్మెస్సీ (గణితం) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, గేట్ లేదా నెట్ అర్హతతో పాటు మ్యాట్ ల్యాబ్ ప్రొగ్రామింగ్‌లో ప్రావీణ్యం ఉన్న 32 ఏండ్ల వయస్సులోపు వారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు, మహిళలకు ఐదేండ్ల సడలింపు ఉంటుంది) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జేఆర్‌ఎఫ్‌గా ఎంపికైన వారికి నెలకు రూ. 37వేల భత్యం, ఇంటి అద్దె అలవెన్సు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డాక్టర్ రెజా 78730 49059ను సంప్రదించాలని, లేదా mreza<\@>gitam.edu or motaharreza90<\@>gmail.comకు మెయిల్ చేయాలని సూచించారు. డాక్టర్ రెజాను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు అభినందించారు.